సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 11 । జనవరి । 2025



'బరి'లోకి దిగాల్సిందే !

'తగ్గేదేలే' అంటూ పందెంరాయుళ్లు సంక్రాంతి బరిలో దూసుకుపోతున్నారు. అధికారుల ఆంక్షలను పట్టించుకోకుండా బరులు సిద్ధం చేస్తున్నారు. IIలో ▸



రాజధానిలోనే తేల్చుకుంటాం

తేతలిలో పశువధ కర్మాగారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బాధితులు మంగళగిరిలో జనసేన, టీడీపీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. IIలో ▸



వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

మొగల్తూరు మండలం కొత్తపాలెంలో వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళనకు దిగారు. IIలో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ గోపాల కృష్ణారావుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో నిజరూపంలో ఉన్న శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో పండితులు, అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ బాబురావు చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

కల్లాల్లో ధాన్యం కొనరా ?

ఏలూరు (టూటౌన్): కృష్ణా డెల్టా పరిధిలో ధాన్యం కొనుగోలు టార్గెట్స్ పూర్తయ్యాయనే పేరుతో రైతులు, కౌలు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏంటని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో ధాన్యం కొనుగోలులో సమస్యలపై ఆయన మాట్లాడారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కృష్ణా డెల్టా పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల పరిధిలో ధాన్యం సేకరించికపోవడం తగదన్నారు. అలాగే నాణ్యమైన గోనె సంచులు అందించాలన్నారు.

పటిష్టంగా మావుళ్లమ్మ ఉత్సవ ఏర్పాట్లు



సూచనలిస్తున్న డీఆర్వో, ఏఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 62వ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా రెవెన్యూ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ భీమారావు తెలిపారు. ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించి నిర్వాహకులు, అధికారులకు సూచనలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ అలంకరణ ఏర్పాట్లలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్యూలైన్లు పక్కాగా ఏర్పాటుచేయాలన్నారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, సిబ్బంది ఉన్నారు.


జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో 2025-26 నుంచి కొత్త ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు, ఇప్పటికే నిర్వహణలో ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రభుత్వ గుర్తింపు పునరుద్ధరణకు ఆయా యాజమాన్యాలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ముసునూరు, టి.నరసాపురంలో కొత్తగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అవకాశం ఉందని, ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ సూపరింటెండెంట్‌ను సెల్ 9440431377 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఎల్‌ఓల గౌరవ వేతనం విడుదల

ఏలూరు(మెట్రో): జిల్లాలో బీఎల్‌ఓలకు 2021 నుంచి రావాల్సిన గౌరవ వేతనాన్ని విడుదల చేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో రూ.1,82,59,500లు మంజూరు చేశారు. నియోజకవర్గాల వారీగా ఉంగుటూరుకు రూ.2.41 లక్షలు, దెందులూరుకు రూ.25.09 లక్షలు, ఏలూరుకు రూ.22.02 లక్షలు, పోలవరానికి రూ.29.82 లక్షలు, చింతలపూడికి రూ.28.60 లక్షలు, నూజివీడుకి రూ.30.03 లక్షలు, కైకలూరుకి రూ.24.61 లక్షలను విడుదల చేశారు. కలెక్టర్‌కు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌కు రూ. 5000



ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు
- భీమవరం నుంచి టికెట్ ధర చూస్తే చుక్కలే..
- మూడు నుంచి నాలుగు రెట్ల వరకు పెంపు
- విమాన చార్జీలతో పోటీపడుతున్న ప్రైవేట్ బస్సులు
- బెంబేలెత్తిపోతున్న సంక్రాంతి చుట్టాలు
- ఆర్టీసీ 210 ప్రత్యేక సర్వీసులు

సాక్షి, భీమవరం: హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.5 వేలు ఇదేదో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమాన టికెట్ ధర అనుకుంటే పొరబడినట్టే.. సంక్రాంతికి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల దందాకు పరాకాష్ట ఇది. సంక్రాంతి పండుగల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న జిల్లావాసులు స్వస్థలాలకు రావడం మొదలైంది. ఆర్టీసీ బస్సుల టికెట్ ధరలు మామూలుగానే ఉండగా ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రం ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు చార్జీలు సాధారణంగానే ఉండగా శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు మొదలవ్వడంతో టికెట్ ధరలను అమాంతం పెంచేశాయి. హైదరాబాద్ నుంచి భీమవరం వచ్చేందుకు 11, 12, 13 తేదీల్లో సీటు ధర రూ.2 వేల వరకు ఉంటే, బెర్త్ రూ.3 వేల వరకు ఉన్నాయి. 15వ తేదీతో పండుగలు ముగియనుండగా కొందరు అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణమైతే అధిక శాతం మంది 16వ తేదీ నుంచి 20వ తేదీ లోపు వెళుతుంటారు. ఇదిలా ఉండగా 15వ తేదీ నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సుల్లో బెర్త్ ధరలు విమాన టికెట్లతో పోటీపడుతూ ఆన్‌లైన్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చూపిస్తున్నాయి.

భారీగా చార్జీల పెంపు

జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల నుంచి 40కి పైగా వివిధ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు వెళుతుంటాయి. మామూలు రోజుల్లో భీమవరం నుంచి హైదరాబాద్‌కు రానూపోనూ స్లీపర్ రూ.1,500 నుంచి రూ.2,000, సీటు అయితే రూ.1,200 నుంచి రూ.1500లోపు చార్జీ ఉంటుంది. సంక్రాంతి సందర్భంగా ధరలు పెంచేయడంతో రానూపోనూ సగటున ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమాలకు చెక్

హైదరాబాద్‌కు సర్వీసు నడిపేందుకు పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఒక నంబర్‌పై పర్మిట్ తీసుకుని అదే నంబర్‌ను రెండు మూడు బస్సులకు ఏర్పాటుచేసి నడిపిన సందర్భాలు గతంలో జరిగాయి. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిబంధనలు కట్టుదిట్టంగా అమలుచేసి అక్రమాలకు, విచ్చలవిడిగా టికెట్ ధరల పెంపునకు బ్రేక్ వేసింది. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ నిర్వాహకులు ఒక పర్మిట్‌పై పాత బస్సులను నడిపే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. కాగా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఆర్టీసీలో గత ప్రభుత్వ విధానమే కొనసాగింపు

గతంలో సంక్రాంతి, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఆర్టీసీ సైతం ప్రత్యేక సర్వీసులకు టికెట్ ధరపై 50 శాతం అధికంగా వసూలు చేసేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయాణికులపై భారం పడకుండా పండుగల ప్రత్యేక బస్సులకు సాధారణ టికెట్ ధరలే వసూలు చేసేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అదే విధానాన్ని ఆర్టీసీ అమలుచేస్తోంది. సంక్రాంతి పండుగల కోసం జిల్లా నుంచి సాధారణ టికెట్ ధరలపై రానుపోనూ 210 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



ఈ చిత్రాన్ని గమనించారా ? ఈ నెల 17న గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు విమాన టికెట్ ధర సాయంత్రం 4.50 గంటలకు రూ.4,098 ఉంటే, 6.10 గంటలకు రూ.4,685, రాత్రి 8.15 గంటలకు రూ.4,389, రాత్రి 9.25 గంటలకు రూ.3,797గా ఉన్నాయి.

ఈ చిత్రాన్ని చూశారా? ఏసీ స్లీపర్ బస్సు టికెట్ చార్జీ రాత్రి 7.45 గంటలకు రూ.4,000 ఉంటే, రాత్రి 9.45 గంటలకు రూ.4,000 నుంచి రూ.5,000 చూపిస్తున్నాయి. ఈనెల 17న భీమవరం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఓ ప్రైవేట్ బస్సుకు ఆన్‌లైన్‌లో చూపిస్తున్న చార్జీ ఇది.

శృంగవృక్షంలో వైద్య శిబిరం



వైద్య శిబిరం వద్ద వైద్యాధికారులు, సిబ్బంది

సాక్షి స్పందన

పాలకోడేరు: 'శృంగవృక్షంలో డయేరియా విజృంభణ' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. వీరవాసరం పీహెచ్‌సీ డాక్టర్ జె.లీలాలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేయగా జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ ధనలక్ష్మి, జిల్లా ఎపిడిమాలజిస్ట్ సుభాష్, ఎంపీహెచ్ఈఓ సుకుమార్ సందర్శించారు. ఇంటింటా సర్వే నిర్వహించడంతో పాటు గ్రామంలో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. గ్రామంలో సుమారు 40 మందికి చిన్నపాటి వ్యాధులను గుర్తించి వైద్యం అందిస్తున్నామన్నారు. కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా గ్రామంలోని రావిచెరువులోని కలుషిత నీటిని సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ తెలిపారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

నరసాపురం: విద్యాలయాల్లో గుణాత్మక, సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన జరగాలని, విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం జరిగిన నరసాపురం వైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ (75 ఏళ్లు) వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలు తొలగాలంటే అందరూ విద్యావంతులు కావాలన్నారు. విలువలతో కూడిన విద్య నేర్పించాలన్నారు. యువత పెడదారి పట్టకుండా విద్యాలయాల్లోనే వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. 1949లోనే విద్య ఆవశ్యకతను గుర్తించి వైఎన్ కళాశాలను స్థాపించిన యర్రమిల్లి నారాయణమూర్తి దార్శనికులని కొనియాడారు.

ప్రపంచవ్యాప్త గుర్తింపు : కళాశాల పూర్వ విద్యార్థులు హైకోర్టు రిటైర్డ్ జడ్జి గ్రంధి భవానీ ప్రసాద్, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లో పేరు తెచ్చుకున్నారని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ కృషిని అభినందించారు. అనంతరం కళాశాల 75 వసంతాల బుక్‌లెట్‌ను అతిథులు ఆవిష్కరించారు. ముందుగా పురందేశ్వరి కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని, మంత్రి నిమ్మల రామానాయుడు వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ డి.శ్రీవేద, కళాశాల పాలకవర్గం ప్రతినిధులు పొన్నపల్లి శ్రీరామారావు, పోలిశెట్టి రఘురామ్, బళ్ల వెంకటేశ్వరరావు, సీహెచ్ రెడ్డప్పధవేజీ, పీజీ కోర్సుల డైరెక్టర్ నిమ్మల చింతారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నరసాపురంలో వైఎన్ కళాశాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు ప్రభుత్వం హామీలేని రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ జిల్లాలో 70 నుంచి 80 శాతం మంది కౌలురైతులే పంటలు పండిస్తున్నారన్నారు. అయితే బ్యాంకులు వీరికి పంట రుణాలు మంజూరులో సహకరించడం లేదని ఆరోపించారు. ముసునూరు మండలం వలసపల్లి గ్రామంలో 70 మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉండగా ఇద్దరికి మాత్రమే రుణాలిస్తామని బ్యాంకర్లు ఆంక్షలు పెడుతున్నారని విమర్శించారు. అనంతరం వ్యవసాయ శాఖ జేడీకి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమ్మె హెచ్చరిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ హెచ్చరించారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఏలూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) వద్ద జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు. సొసైటీ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, సొసైటీల ప్రైవేటీకరణ, సిబ్బందిని కుదించే ఆలోచనలు మానుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్, సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో జారీ చేసిన జీఓ 36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ, ఆప్కాబ్ తమ వంతు నిధులు సమకూర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డీసీసీబీ, ఆప్కాబ్ కాలక్షేపం

పీఏసీఎస్‌లకు డివిడెండ్లు ఇవ్వకుండా, సిబ్బంది వేతనాల ఖర్చుల్లో తమ వాటాలు భరించకుండా డీసీసీబీ, ఆప్కాబ్‌లు కాలక్షేపం చేస్తున్నాయని సత్యనారాయణ విమర్శించారు. ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2019, 2024 వేతన సవరణ వెంటనే చేపట్టి సిబ్బందికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత పీఏసీఎస్‌లలో చేరిన వారిని తొలగించరాదని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్, కార్యదర్శి కృష్ణశాస్త్రి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, కార్యదర్శి పి.సుబ్బారావు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం సీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సీఈఓ హామీ ఇచ్చారు.



డీసీసీబీ కార్యాలయం వద్ద ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కార్యదర్శి

గళమెత్తిన మున్సిపల్ కార్మికులు



భీమవరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

భీమవరం: మున్సిపల్ కార్మికులకు సమ్మె ఒప్పందలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ పనికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు మూడేళ్లుగా రావాల్సిన సరెండర్ లీవులు విడుదల చేయాలన్నారు. కూటమి అధికారం చేపట్టి ఏడు నెలల గడుస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణన్నారు. కార్మికులు పనిచేయడానికి సరైన పనిముట్లు, వాహనాలు లేవని వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, బంగారు ఏసేబు, ధనాల చినపెద్దిరాజు, నీలాపు నాగేశ్వరరావు, అప్పన్న, మాడుగుల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠవాసా.. శ్రీ వేంకటేశా

చిన్న తిరుపతిలో వేడుకగా శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమల : చిన వెంకన్న క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది.. వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వారం వద్ద స్వామివారి దర్శనం నేత్రపర్వమైంది. ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం వేకువజామున 4.15 గంటలకు ఉత్తర ద్వారాలను తెరవగా ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పెన్మత్స నరసింహరాజు, ఆలయ ఈఈ డీవీ భాస్కర్ తదితరులు తొలి దర్శనం చేసుకుని, పూజాదికాలు చేయించారు. ఉదయం 4.50 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శన భాగ్యాన్ని కల్పించారు. వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల సమయంలో ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం మీదుగా గరుడ వాహనంపై గ్రామోత్సవానికి తీసుకువెళ్లారు. అనంతరం ఉత్తర ద్వారం వద్ద వెండి శేష వాహనంపై స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటల వరకు భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలూ కిటకిటలాడాయి. గోవింద దీక్షా ధారులు వేకువజామున ఆలయ ప్రధానరాజ గోపుర మెట్ల మార్గంలో కర్పూరంతో స్వామివారి శంఖు, చక్ర, నామాలను ఏర్పాటు చేసి, వాటిని వెలిగించారు. అనంతరం ఇరుముడులతో స్వామి దర్శనం చేసుకుని దీక్షలను విరమించారు.



ప్రధాన రాజగోపురం మీదుగా గరుడ వాహనంపై గ్రామోత్సవానికి వెళుతున్న ఉత్సవమూర్తులు





ఉత్తర ద్వారం వద్ద చిన వెంకన్నను దర్శిస్తున్న భక్తులు, వెండి శేష వాహనంపై కొలువైన స్వామివారు



పాదుకా మండపం వద్ద కర్పూర హారతులు సమర్పిస్తున్న గోవింద స్వాములు

క్లుప్తంగా

18న సచ్చిదానంద స్వామీజీ రాక



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక దత్త క్షేత్ర కార్యదర్శి కె.కృష్ణమూర్తి

ఆకివీడు : విశ్వంభర రాగ సాగర సంగీత భరిత ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మైసూరు పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ నేతృత్వంలో నిర్వహిస్తారని స్థానిక దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి చెప్పారు. దత్త క్షేత్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న స్వామీజీ ఆకివీడులోని దత్త క్షేత్రానికి చేరుకుంటారన్నారు. అనంతరం అనుగ్రహ భాషణం, మహా దర్శనం ఉటుందని.. ఈ నెల 18వ దత్త క్షేత్రంలో విశ్వంభర రాగ సాగర పేరుతో సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో దత్త క్షేత్ర ఉపాధ్యక్షుడు దండు రామకృష్ణంరాజు, ట్రస్టీ వేంపాటి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆంజనేయులు

కాళ్ల: సీసలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని కాళ్ల పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన ద్రోణాద్రి ఆంజనేయులు(38) భార్య, పిల్లలతో కలిసి గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై సంక్రాంతి పండుగకు బట్టలు కొనడానికి భీమవరం వెళ్తుండగా కాళ్ళ మండలం సీసలి సాయిబాబా గుడి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఆంజనేయులు కుటుంబ సభ్యులతో సహా రోడ్డుపై పడ్డారు. మృతుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

350 కోడి కత్తుల స్వాధీనం

భీమవరం: సంక్రాంతి సందర్భంగా ఆకివీడు పోలీసు సర్కిల్ పరిధిలో 350 కోడికత్తులు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. శుక్రవారం కాళ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని ఏలూరుపాడు, కాళ్లకూరు, సీసలి గ్రామాలకు చెందిన గనిశెట్టి శ్రీనివాసు, రాంబాబు, బూరా వెంకటేశ్వరరావు, జోగి వెంకట సత్యనారాయణ వద్ద కోడి కత్తులు ఉండడంతో వారిని అదుపులోనికి తీసుకుని కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. భీమవరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఇంతవరకు 478 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు.

సాగుకు అవకాశం కల్పించాలి

ఏలూరు(టూటౌన్) : ఎర్రకాల్వ రిజర్వాయర్ భూముల్లో మిగులుగా ఉన్న మూడు వేల ఎకరాలను రెండు మండలాల్లోని పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులకు సాగుకు అవకాశం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ. రవి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద డీఆర్ఓ విశ్వేశ్వరరావుకు వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ వినతి పత్రం అందజేసింది.

రాజధానిలోనే తేల్చుకుంటాం

- జనసేన, టీడీపీ కార్యాలయాల్లో పశువధ బాధితుల ఫిర్యాదు
- స్థానిక నేతలు, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం





తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన బాధితులు(ఫైల్), మంగళగిరిలో జనవాణిలో పశువధ శాలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తణుకు వాసులు

తణుకు అర్బన్: తణుకు మండలంలోని తేతలి వద్ద పశువధ కర్మాగారంపై స్థానికులు, గోసేవా సమితి ప్రతినిధులు తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తం చేస్తున్నా.. అధికార యంత్రాంగం మాత్రం యాజమాన్యానికే కొమ్ముకాస్తోంది. ప్రభుత్వం ఆదేశాలతో.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. 'ఈ దుర్వాసనకు ఉండలేకపోతున్నాం.. పిల్లలకు వాంతులైపోతున్నాయి.. ఇళ్లలో కలిసి భోజనం చేయలేకపోతున్నాం.. మీకాళ్లు పట్టుకుంటే మాకు న్యాయం జరుగుతుందంటే కాళ్లు పట్టుకోడానికి సిద్ధం.. మాకంటే ఆ కసాయి సంస్థే ఎక్కువైతే వారినే ఉంచుకోండి.. మా ఇళ్లకు రేటు కట్టి ఇచ్చేసి పొమ్మంటే పోతాం' అంటూ కన్నీరు కార్చినా కరుణించడం లేదు. గత ఐదేళ్లలో ఎలాంటి పశువధ జరగలేదని, ఎలాంటి దుర్వాసన రాలేదని, రెండు నెలలుగా దుర్వాసనకు పిల్లలను ఆస్పత్రుల చుట్టూ తిప్పలేక రోడ్డెక్కాల్సి వచ్చిందంటూ కన్నీళ్లపర్యంతమవుతున్నారు. జీవించే హక్కును హరిస్తున్నా పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారంటూ కోపోద్రిక్తులవుతున్నారు. వారి కన్నీటి వ్యథను చెప్పుకునేందుకు స్థానికులు మంగళగిరి జనసేన ఆఫీసులో జరిగే జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అలాగే టీడీపీ కేంద్ర కార్యాలయంలో తమ గోడు వినిపించారు.

మొదటి నుంచీ నిర్బంధం

పశువధ శాల నుంచి దుర్వాసనకు ఇళ్లలో ఉండలేక రోడ్డెక్కిన బాధితులకు గో సేవా సమితి అండగా నిలబడింది. గత నెలలో పశువధ శాలకు గేదెలు తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని పోలీసులకు అప్పగించడంతో ఉద్యమం మొదలైంది. పశువధ శాల ముందు టెంట్లు వేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. శిబిరాన్ని పోలీసులు తమ అధికారంతో భగ్నం చేశారు. తణుకులో నిరాహార దీక్షలు చేసుకుంటామని గోసేవా సమితి పోలీసులను అనుమతి కోరగా 144 సెక్షన్ అమల్లో ఉందంటూ నిరాకరించారు. పాలకుల ఒత్తిడి కారణంగానే అధికారులు, పోలీసులు కూడా పశువధ నిర్వహిస్తున్న సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బాధితులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

డబ్బులు చేతులు మారడం వల్లే..

తేతలి పరిధిలో నిర్వహిస్తున్న పశువధ శాల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నా.. అది నడుస్తుందంటే కోట్లాది రూపాయల డబ్బు చేతులు మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు భారీగా చేతులు మారాయని మాజీ మంత్రి కారుమూరి సైతం ఆరోపించారు. తణుకు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఈ అంశంపై చర్చ సాగుతోంది. దీని వెనుక ఎవరు ఉన్నారనే విషయంపై ప్రజలు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చారని చెబుతున్నారు.

జనవాణిలో ఫిర్యాదు

పశు వధ వ్యవహారంపై స్థానిక పాలకులు పట్టించుకోకపోవడంతో చేసేదిలేక శుక్రవారం పశు వధ శాలకు సమీపంలో ఉన్న మహిళలతోపాటు సజ్జాపురం అండర్ గ్రౌండ్ నివాసిత మహిళలు 40 మంది మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి బస్సులో వెళ్లారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అక్కడ అందుబాటులో లేకపోవడంతో జనవాణి కార్యక్రమంలో పశువధ శాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు అందచేశారు. అలాగే టీడీపీ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వినిపించారు.

బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ

మొదటి నుంచి ఈ పశువధ శాలకు వ్యతిరేకంగా ఉంటూ బాధితులకు అండగా నిలబడ్డ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు కర్మాగారాన్ని మూసివేయించే వరకు పోరాడతామని హామీ ఇవ్వడంతోపాటు పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణకు తణుకులో గోసేవా సమితి ద్వారా అందిన ఫిర్యాదుకు స్పందించి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఫ్యాక్టరీని మూయించే క్రమంలో అవసరమైతే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తణుకు రానున్నట్లు కారుమూరి ప్రకటించారు. కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతకు తలలు పట్టుకుంటున్నారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: వెంకటేశ్వర స్వామి భక్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మూల్యం చెల్లించుకోకతప్పదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంటు వడ్డి రఘురాం అన్నారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల కౌంటర్ల వద్ద జరిగిన తొక్కిసలాట విషాదకరం అన్నారు. గతంలో తిరుమల లడ్డూలో కల్తీ అంటూ రాష్ట్ర ఖ్యాతిని పాడుచేసిన చంద్రబాబు అండ్ కో తాజా తొక్కిసలాట ఘటనతో మరోసారి రాష్ట్ర ప్రతిష్టను అభాసుపాలు చేశారన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. వెంకటేశ్వరస్వామితో ఆటలాడవద్దని చంద్రబాబుకు గతంలోనే జగన్‌మోహన్ రెడ్డి హితవు పలికారన్నారు. మాజీ ముఖ్యమంత్రి పరామర్శకు వెళితే క్షతగాత్రులను ఆసుపత్రి నుంచి ఖాళీ చేయించడాన్ని తప్పుపట్టారు. భక్తులకు కనీస అవసరాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అన్నారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో అధికారులు తరించడం వల్లే ఈ తప్పిదం జరిగిందన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొత్తపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- గ్రామ పెద్దల సహకారంతో వెంటనే మరో విగ్రహం ఏర్పాటు
- గతంలోనూ విగ్రహం పాక్షికంగా ధ్వంసం.. పట్టించుకోని పోలీసులు



కొత్తపాలెంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలోని కొత్తపాలెంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలియడంతో శుక్రవారం ఉదయం మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామానికి తరలివచ్చారు. డీఎస్పీ డాక్టర్ వేద, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ వాసు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భీమవరం నుంచి డ్వాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. పోలీస్ జాగిలం ధ్వంసమైన విగ్రహం వద్ద వాసన చూసి కొద్ది దూరం వెళ్లి ఆగిపోయింది.

ఆందోళనకు దిగిన నేతలు

వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి, మండల అధ్యక్షుడు రేవు నారాయణ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలా రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ అమర్ రహే, విగ్రహం ధ్వంసం చేసినవారిని త్వరితగతిన గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. పోలీసులు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులపై కేసులు నమోదు చేశామని, ఈ కేసులో కొంత పురోగతి సాధించామని, రెండు రోజుల్లో నిందితులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కొత్తపాలెం నాలుగు రోడ్ల కూడలిలో 2011లో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేశారు. 2024 జూన్ 25న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహం రెండు చేతులూ విరిచి ధ్వంసం చేశారు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిందితులను అరెస్ట్ చేసిన తర్వాత.. గ్రామస్తులతో మాట్లాడి మరో విగ్రహాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనేది నిర్ణయించుకుంటామని, అంతవరకు ధ్వంసమైన విగ్రహాన్ని తొలగించరాదని వైఎస్సార్‌సీపీ నేతలు తేల్చి చెప్పడంతో పోలీసులు కూడా అంగీకరించారు. గ్రామంలోని వివాదాలు దృష్టిలో పెట్టుకుని గ్రామ పెద్దలు, నాయకులు విగ్రహం ధ్వంసం చేసిన ప్రదేశంలోనే మరో విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన స్థలంలో మరో విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహాన్ని స్థానిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రి ఏసుబాబు, కొల్లాబత్తుల రవి కుమార్, తన్నీడి గిరి, కొత్తపల్లి బాబి, వేగి బాబి, రేవు రాంబాబు, పడవల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదుపులో ఐదుగురు అనుమానితులు

కొత్తపాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం కేసులో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వాసు తెలిపారు. స్థానిక వీఆర్వో కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మరో వ్యక్తిని త్వరలో అదుపులోకి తీసుకుని విచారిస్తామని తెలిపారు.

బరిలోకి దిగాల్సిందే!



కొయ్యలగూడెం మండలం ప్రధాన రహదారికి ఆనుకుని సిద్ధం చేసిన కోడిపందేల బరి

కొయ్యలగూడెం: ఏదైనా 'తగ్గేదేలే' అంటూ పందెంరాయుళ్లు సంక్రాంతి బరిలో దూసుకుపోతున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల ఆంక్షలు షరా మామూలే.. అంటూ పందెం బరులు సిద్ధం చేస్తున్నారు. మెట్టలో పెద్ద ఎత్తున సంక్రాంతి పందెలకు సిద్ధమవుతున్నారు. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా పద్దెనిమిది పంచాయతీల్లో బరుల ఏర్పాటుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కూటమి నాయకులు బరులతో సహా జూద క్రీడలు, మద్యం బెల్ట్ షాపుల పంపకాలు చేసుకున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే అధికారులతో బేరసారాలు సాగించి ముందుకు దూసుకుపోతున్నారు. మండలంలో రామానుజపురంలో టీడీపీకి చెందిన వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబుకి చెందిన బరి అతి పెద్దదిగా నిలవనుంది. ఇప్పటికే తెలంగాణ నుంచి చేరుకున్న అతిథులకు ఆయన ప్రత్యేక మర్యాదలు అందజేస్తున్నారు. అదేవిధంగా రాజవరం పంచాయతీలో మొట్టమొదటిసారిగా భారీ స్థాయిలో గ్యాలరీ, ఎల్సీడీలు ఏర్పాటు చేస్తున్నారు. కోడిపందేల మాటున భారీ స్థాయిలో జూద క్రీడల నిర్వహణకు కూటమి నాయకులు తెర లేపారు. అధిష్టానం కూడా అభయం ఇవ్వడంతో తెలుగు తమ్ముళ్లు, జన సైనికులతో సహా కాషాయదళం పంపకాలను పంచుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. కోడిపందేలలో అందవేసిన ఒక వ్యక్తి రూ.కోటితో పందెం కాయడానికి సిద్ధంగా ఉన్నానంటూ పందెం రాయుళ్లకు కబురు పంపాడు. ఒకే పందెం రూ.కోటి నిర్వహిస్తానంటూ సవాల్ విసిరాడు. మెట్ట ప్రాంతంలోని ఆగిరిపల్లి మండలంలో కూడా పందేల కోసం భారీ ఎత్తున బరులు సిద్ధం చేస్తున్నారు.



కొయ్యలగూడెం మండలం గంగవరం సమీపంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు



ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో శివారులో సిద్ధం చేసిన బరి

మామిడికి తామర పురుగు బెడద

పాడి-పంట

నూజివీడు: రాష్ట్రంలోని ఏలూరు జిల్లాలో ఉన్న మామిడి తోటల్లో తామరపురుగు బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామర పురుగు కారణంగా పూత మాడిపోవడంతో పాటు పిందెలు ఏర్పడితే వాటిపై రాతి మంగు వస్తుండటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ప్రాంతంలో రైతులకు మామిడే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో ఆశలన్నీ దీనిపై పెట్టుకుని ఆశగా ఎదురుచూస్తున్నారు. మామిడికి తెగుళ్ల బెడద ఎదురవడంతో తమ ఆశలు అడియాశలు అవుతాయామోననే ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డివిజన్‌లో దాదాపు లక్ష ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ ఎక్కువగా బంగినపల్లి, చిన్నరసం, తోతాపురం(కలెక్టర్) రకం కాయలను రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. ఈ ప్రాంతంలో వరి తరువాత ముఖ్యమైన పండ్ల తోటలు మామిడే. వరిలో నష్టాలు వచ్చినా, మామిడి పంట నష్టాల నుంచి గట్టెక్కిస్తుందనే నమ్మకం ఇక్కడి రైతులది.

పూత బాగా వచ్చినప్పటికీ..

బంగినపల్లి, కలెక్టర్, చిన్నరసాల తోటలలో ఈ ఏడాది పూతలు బాగానే వచ్చాయి. మొత్తం విస్తీర్ణంలో దాదాపు 70 శాతంకు పైగా తోటల్లో పూతలు వచ్చాయి. మామిడి ఒక ఏడాది కాస్తే, మరో ఏడాది కాపు తక్కువగా ఉంటుంది. గతేడాది పెద్దగా కాపు లేని నేపథ్యంలో ఈ ఏడాది అధికంగా తోటల్లో పూత వచ్చింది. ప్రస్తుతం తోటలు తెల్ల పూత, ముదురు పూత, పిందె దశల్లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తామర పురుగులు ఉధృతంగా ఉండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన కనిపిస్తోంది. ఈ పురుగులు ఆశిస్తే కాయ నాణ్యత దెబ్బతింటుందని, దీంతో మార్కెట్‌లో ధర లభించక తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామర పురుగులు ఆశించడం వల్ల పూత మాడిపోతుండటంతో పాటు పిందెలపై రాతిమంగు ఏర్పడుతోంది. దీంతో దిగుబడి బాగున్నప్పటికీ రాతి మంగు ఉంటే పెద్దగా ధర పలకదని, దీంతో నష్టాల పాలు కావాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. తామర పురుగుల నివారణకు రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మామిడి అనేది ప్రకృతి ఆధారిత పంట కావడంతో రైతులు తమ ప్రయత్నాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాది మామిడి పంట లాభాలు పంచుతుందో, నష్టాల చేదును మిగుల్చుతుందో వేచి చూడాల్సిందే.





మామిడి తోటలో రసాయన మందులు పిచికారీ చేస్తున్న రైతులు, మాడుతున్న మామిడిపూత

తీసుకోవాల్సిన చర్యలు ఇవే



మామిడి తోటల్లో తామర పురుగుల బెడద అధికంగా ఉంది. వీటి నివారణకు తోటల్లో నీలం, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి. తెల్ల పూత రాని తోటల్లో వేప నూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. దీనివల్ల తామర పురుగుల గుడ్లు నశిస్తాయి. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే 0.5 ఎంఎల్, థయోమిథాక్జామ్ 0.5 గ్రా లేదా ఫిప్రోనిల్ గోల్డ్ 2 ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఆర్.హేమ, ఉద్యాన అధికారిణి, నూజివీడు

ఆటోలో ప్రయాణిస్తూ నగదు చోరీ



మహిళా దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: ఆటోలో తోటి ప్రయాణికుల్లా ప్రయాణిస్తూ.. ఒక మహిళ నుంచి నగదు కాజేసిన కేసులో ఐదుగురు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య చెప్పారు. శుక్రవారం భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న గణపవరం మండలం పిప్పరకు చెందిన వేగిరాజు రామలక్ష్మి ప్రకాశం చౌకొసెంటర్‌లో ఆర్టీసీ బస్సు దిగి తన బ్యాగ్‌తో జువ్వలపాలెం రోడ్డులో వెళుతున్న ఆటో ఎక్కింది. అదే ఆటోలో తాడేపల్లిగూడెం పట్టణం యాగర్లపల్లికి చెందిన యరసాని మార్తమ్మ, యరసాని వరలక్ష్మి, ఉయ్యాల సాయికుమారి, ఉయ్యాల సుబ్బలక్ష్మి, బాలిక ఎక్కారు. రామలక్ష్మిని మాటల్లోపెట్టి ఆమె బ్యాగ్‌లోని రూ.1.50 లక్షలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం నిందితుల్ని గొల్లవాని తిప్పరోడ్డులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. నలుగురు పాత నేరస్తులని వారిపై గతంలో కేసులున్నాయన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం : క్రీడల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకోవడమేగాక మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఇటీవల భోపాల్‌లో నిర్వహించిన 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో భీమవరం ఛాంపియన్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. దేవరపు సౌమ్యశ్రీ 22వ ర్యాంక్, అల్లు లిఖిత్‌రామ్ 39వ ర్యాంకు సాధించిన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించారు. కోచ్ సయ్యద్ సుభాన్ మాట్లాడుతూ సౌమ్యశ్రీ, లిఖిత్రారామ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

క్లుప్తంగా

గోపినాథపట్నం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని పూజలు నిర్వహిస్తున్న కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాథపట్నం ఆంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో దేవదాయశాఖ ధర్మదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. గోపూజ సహస్ర దీపాల పూజ, లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలు చేశారు. భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొట్టు సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. తాడేపల్లిగూడెంకు చెందిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, లలిత కళల రాష్ట్ర మాజీ డైరెక్టరు మానుకొండ వెంకటేశ్వరరావు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చనలు జరిపి, విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్ల అద్దాల మండపంలో ఉంచడంతో భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మాధవరం గ్రామంలోని సీతారామస్వామి వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా చినతాడేపల్లి, నీలాద్రిపురం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం, కొమ్ముగూడెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, నందమూరు, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, దండగర్ర, కృష్ణాపురం గ్రామాల్లోని అంజన్న ఆలయాలను భక్తులు విరివిగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి సింధూరార్చన, తులసీ పూజ ఇత్యాది పూజా కార్యక్రమాలు జరిపారు. ఆరుగొలను గ్రామంలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో సొసైటీ మాజీ చైర్మన్ నూకల వెంకటరత్నం (బుల్లియ్య)దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శతాధిక వృద్ధుడు మృతి

అత్తిలి: మండలంలోని కె సముద్రపుగట్టు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కన్నేటి ముసలయ్య (111) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందా డు. ఈయన 40 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పని చేసారు. శాంతిదూతగా పేరుగాంచిన ముస లయ్య మృతిపట్ల పలువురు గ్రామ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఎస్సీ కుల గణన తప్పుల తడక

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో ఎస్సీ కులం మార్చే కుట్ర జరుగుతుందని, ఎస్సీ కుల గణన తప్పుల తడకగా మారిందంటూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ కుల గణన పేరుతో ఆర్యన్ మాల, ఆర్యన్ మాల క్రిష్టియన్, ఆది ఆంధ్ర, ఆది ఆంధ్ర క్రిష్టియన్, ఎస్సీ మాల క్రిష్టియన్‌గా తప్పుడు సమాచారాన్ని ముద్రిస్తున్నారని పేర్కొన్నారు. గత 30 ఏళ్ల నుంచి ఎస్సీ మాల కులానికి చెందిన శాశ్వత సర్టిఫికేట్లు ఉన్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన కుల గణన జాబితాపై సమగ్ర సర్వే చేయించి తప్పులు సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మానుకొండ నాగేశ్వరరావు, సునీల్, అనిల్‌లు పాల్గొన్నారు.

పల్లెల్లో దుర్గంధం

- పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- రాజకీయ కారణాల వల్ల దుస్థితి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించింది. దుర్వాసన వెలువడుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు డ్రెయినేజీల శుభ్రత లేక దోమలు విపరీతంగా పెరిగి పోయాయి. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. ఈ గ్రామాలలో తాగునీరు కూడా సరిగా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితం అవుతోంది. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను పంచాయతీలకు తరలించకుండా కాలువను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. పెంటపాడు మండలంలో ప్రధానంగా అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవిల్ కాలువ ప్రాంతాలలో కె. పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాలలోని కాలువలో చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. అధికార సందిగ్ధత నెలకొనడంతో గ్రామాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక సంస్థలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఒక పార్టీకి చెందిన వారు ఉండగా రాష్ట్రంలో మరోక పార్టీ అధికారంలో చెలాయిస్తుంది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులను స్వచ్ఛంగా అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు చేయనీయకుండ అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు తామే చేయాలని, తమకు తెలియకుండా ఏ పని జరగకూడదంటూ అడ్డూకుంటున్నారు. దీంతో ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. అరకొరగా చేస్తూ కాలాన్ని నెట్టుకువస్తున్నారు. ఇద్దరి మధ్యలో సచివాలయ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంక్రాంతి పర్వదినాలు దగ్గర పడడంతో గ్రామాలకు వచ్చే బంధువులు, అల్లుళ్లకు గ్రామ ముఖద్వారాలలో స్వాగతం పలుకుతున్నట్లు అపారిశుద్ధ్యం దర్శనమిస్తుంది. ఈ పరిస్థితి పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



రాచర్ల నుంచి దర్శిపర్రు వరకు మిడ్‌లెవెల్ కాలువలో అపరిశుభ్రత నెలకొన్న దృశ్యం

రహదారి చెంతనే చెత్త

పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదార్లు చెంతనే చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతో పాటు దుర్గంధం వెదజల్లడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతి ఘటనపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కలియుగ దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి భక్తులు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ చేయించాలని సీపీఎం జిల్లా కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ దేవాదాయ శాఖ, హోంమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారులపై ప్రత్యేక చార్జీలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరారు. భోగి పండుగ సందర్భంగా ప్రజలు భోగి మంటల్లో అదనపు భారాల విద్యుత్ బిల్లులను దగ్ధం చేయాలని, ప్రభుత్వానికి నిరసన తెలిపాలని కోరారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

తణుకు అర్బన్: పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు భవిష్యత్తులో ప్రజలపక్షాన నిర్వహించే పలు నిరసనల్లో పాల్గొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ శ్రేణులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు సూర్యనారాయణరాజు, సరెళ్ల వీరతాత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఇరగవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇరగవరం మండలం పేకేరు గ్రామంలో కార్యకర్తల సమావేశంలో కారుమూరి మాట్లాడారు. చంద్రబాబు ప్రజలను మోసం చేసి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని తెలిపారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో చింతా బాపిరెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, సత్తిబాబు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఇరగవరం: కార్యకర్తలతో కారుమూరి నాగేశ్వరరావు

వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు మేలు

తణుకు అర్బన్: వ్యాధులకు భయపడడం కన్నా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 29, 30 వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, సీజనల్ వ్యాధులపై వైద్య శాఖ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. వారానికోసారి ఇంటి ఆవరణతో పాటు గృహాల్లో నీరు నిల్వ ఉండే సామగ్రిని శుభ్రం చేసుకోవడం ద్వారా దోమ పుట్టుకను లార్వా దశలో చెక్ పెట్టవచ్చని తెలిపారు. మలేరియా, చికున్ గున్యా వ్యాధులను నిరోధించవచ్చని స్పష్టం చేశారు. అతిసారం, టైఫాయిడ్, కామెర్లను కట్టడి చేయడంలో చేతుల శుభ్రత, ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై మూతలు ఉంచడం, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలు పాటించడం కీలకమని అన్నారు. ప్రస్తుత చలికాలంలో శీతల పానీయాలకు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండడం, జలుబు చేస్తే వేడి నీటి ఆవిరి పట్టాలని, గోరువెచ్చని వేడి నీరు తాగాలని, జలుబు, దగ్గు, జ్వరం ఉంటే విధిగా సమీపంలోని వైద్యులను సంప్రదించాలని, సొంత వైద్యం చేసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు బి.వెంకట రమణ, కె.అనుషా సువర్ణ, ఆశా కార్యకర్తలు కెఎన్‌కె. మహాలక్ష్మి, ఎస్.కుమారి పాల్గొన్నారు.



తణుకులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కీటకజనిత ప్రదేశాలను నిలువరిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటకజనిత ప్రదేశాలను నిలువరించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులను అరికట్టవచ్చునని మలేరియా సబ్‌యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక కడకట్ల పరిధిలోని 33, 34, 35 వార్డులలో జరుగుతున్న హెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలలో భాగంగా వార్డులలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత సామాజిక బాధ్యత అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే తప్పక పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని వాటిని నిర్వీర్యం చేయాలని, ఇంటిలోపల, బయట నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. శానిటరీ, హెల్త్ సిబ్బందికి తప్పక ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరి, జ్యోతి, ఆశా వర్కర్ సుజాత, స్వాతి, దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పడాలలో ఆరుగురు జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: కోత బంతి ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేసి, ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పడాల శివారులో కోత బంతి ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,470ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

తణుకు అర్బన్: ముక్కోటి సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తసంద్రంతో కిక్కిరిసిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు భారీస్థాయిలో తరలివచ్చారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా ఆలయాల్లోకి ప్రవేశించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈవో ముత్యాల సత్యనారాయణ పర్యవేక్షణలో స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తణుకు మండలం వేల్పూరు, మండపాక గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చిన మదన గోపాలస్వామి

అత్తిలి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన బల్లిపాడు మదనగోపాలస్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున స్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి, విశేషంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై ఉంచి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మేళతాళాల నడుమ గరుడవాహన గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అత్తిలి: బల్లిపాడులో ఉత్తర ద్వారం నుంచి మదనగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పెంటపాడు: ప్రత్తిపాడు రామాలయం వద్ద స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు



తణుకు అర్బన్: వేల్పూరులో స్వామివారి గ్రామోత్సవం

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

పెంటపాడు: మండలంలో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. కె. పెంటపాడు బైరాగిమఠం వేణుగోపాలస్వామి ఆలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కూచి చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వరం గ్రామంలో రామాలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

కారుమూరి పరామర్శ



ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: మండలంలోని కొత్తపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి ఆంజనేయులు కుటుంబ సభ్యులను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆంజనేయులు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోషి వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

తణుకు అర్బన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. నిరు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతిళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామన్న వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. గృహాల నిర్మాణాలకు రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అసంపూర్ణంగా ఉన్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి అర్హులందరికీ అందజేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు పులపర్తి సత్యనారాయణ, బొద్దాని మురళీకృష్ణ, పుట్టా అమ్మిరాజు, పి.దత్తాత్రేయప్రసాద్ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన జంతు సంక్షేమ సంఘం సమావేశంలో జిల్లా సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మూగజీవాలను హింసించడం చట్టరీత్యానేరమన్నారు. కోడిపందాలు వంటి కార్యకలాపాలు జరగకుండా సంఘం తరపున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె నర్సింహారావు మాట్లాడుతూ జంతు హింసకు పాల్పడితే రూ. 50వేల నుంచి రూ. 70 వేల వరకు జరిమానా, 5ఏళ్లు జైలుశిక్ష విధిస్తారన్నారు. పోలీస్, రెవెన్యూ సమన్వయంతో జంతుహింస నివారణా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తహసీల్దార్ దశిక వంశీ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట వంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఐ పి ప్రేమరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కోడిపందేలు నిషేధించారన్నారు. ప్రశాంతంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని సూచించారు.



అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తణుకు అర్బన్: గత సమ్మె కాలంలో మునిసిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ ఉద్యోగులు మోకాళ్లపై తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా శ్రామిక కన్వీనర్ అడగర్ల అజయ కుమారి సీఐటీయూ సీనియర్ నాయకులు గార రంగారావు, గెల్లా విజయకుమార్, పి. జ్యోతి బాబు, డి.వెంకటేశ్వరరావు, అర్జి కృష్ణబాబు, కుసుమ, గన్నిరాజు, బ్రహ్మాజీ, మందులయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికులకు ఇచ్చిన సమ్మె కాలం హామీలు మధ్యంతర భృతి, సరెండర్ లీవుల వేతనాలు, ఏపీజీఎల్ఐ ఖాతాలు సొమ్ములు క్లియర్‌న్సలను జీవోగా విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మునిసిపల్ కార్మికుల డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే రానున్న రోజులల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావు, తాడికొండ జయరాజు, కృష్ణ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరం



తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు



తణుకు రూట్స్ స్కూలులో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి అధ్యక్షత న నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి పోటీలను ప్రారంభించారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు అలరించాయి. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తణుకు శాఖ ఆధ్వర్యంలో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, మానవత జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.రాధాపుష్పవతి, కె.శారద, ఎక్కల వీరభారతి, అడుసుమల్లి శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

రూట్స్ స్కూల్‌లో...

స్థానిక రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, గొబ్బిళ్లో గొబ్బిళ్లో అంటూ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్లు ఎల్‌కే త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్‌వర్మ, ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ టి.సంధ్య, డి.పద్మజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.